


# జర్నలిస్టులకు రైల్వే రాయితీ కల్పించాలి

◆ రాజ్యసభలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర

వరంగల్ వాయిస్
Evening Daily

సంపుటి : 04 | సంచిక : 165
పేజీలు : 08 | వెల: రూ.5/-
గురువారం
మార్చి 27, 2025
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net




వివరాలు 2లో..

# స్మోక్ సిటీ

## రాంపూర్ డంపింగ్ యార్డ్‌లో విష వాయువులు



◆ కళ్ల మంటలు, చర్మ వ్యాధులతో సతమతం
◆ ఇబ్బంది పడుతున్న 10 గ్రామాల ప్రజలు
◆ నిత్యం 400 టన్నుల చెత్త డంపింగ్ | పేరుకుపోతున్న నిల్వలు
◆ శాశ్వత పరిష్కారం చూపాలి : అసెంబ్లీలో ఎమ్మెల్యే కడియం

మడికొండ, రాంపూర్ గ్రామాల శివారులోని డంపింగ్ యార్డ్ చుట్టు పక్కల గ్రామాల ప్రజలకు ప్రాణ సంకటంగా మారింది. డంపింగ్ యార్డ్ లో తరుచూ మంటలు ప్యాపించడంతో ఆ ప్రాంతమంతా పొగచూరుతోంది. దీంతో ప్రమాదకర విష వాయువులు గాలిలో కలిసి చుట్టు పక్కల గ్రామాలైన ఏల్కుర్తి, కడిపికొండ, తరాలపల్లి, నష్కల్, నర్సింగరావు పల్లేతోపాటు కాజీపేట ప్రాంత ప్రజలకు కంటి మీద కునుకు లేని పరిస్థితి నెలకొంది. ఈ ప్రాంత ప్రజలు కళ్ల మంటలు, చర్మ వ్యాధులతో ఇబ్బంది పడుతున్నారు. శ్వాస సంబంధ సమస్యలు ఈ ప్రాంత ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. అయితే రాంపూర్, మడికొండ ప్రాంతాల నుంచి డంపింగ్ యార్డ్ ను తరలించాలనే డిమాండ్ చాలా రోజులుగా వ్యక్తమవుతోంది. ప్రజలు పెద్ద ఎత్తున ఆందోళనలు సైతం నిర్వహించారు. ఆందోళనలు చేసినప్పుడు హామీలిస్తున్న బల్దియా అధికారులు తర్వాత వాటిని బుట్ట దాఖలు చేయడంతో సమస్య తీవ్ర రూపం దాల్చుతోంది. కాగా వరంగల్ నగర ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని వీలైనంత తొందరలో డంపింగ్ యార్డ్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించాలంటూ అసెంబ్లీ సాక్షిగా స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కోరడం స్థానిక ప్రజలకు కొంత ఊరట నిస్తుంది. - వరంగల్ వాయిస్ ప్రతినిధి

# ప్రారంభమైన దేవాదుల మోటర్లు

◆ ధర్మసాగర్ రిజర్వాయర్ చేరిన నీరు
◆ మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పూజలు



2లో..




2లో..

# రెడ్ క్రాస్ సేవలు అభినందనీయం

◆ హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య

WARANGALVOICE
www.epaper.warangalvoice.net
www.warangalvoice.net
వరంగల్ వాయిస్ Evening Daily
GRATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet
గురువారం, మార్చి 27, 2025

# స్మోక్ సిటీ



- రాంపూర్ డంపింగ్ యార్డ్ లో విష వాయువులు
- కళ్ల మంటలు, చర్మ వ్యాధులతో సతమతం
- ఇబ్బంది పడుతున్న 10 గ్రామాల ప్రజలు
- నిత్యం 400 టన్నుల చెత్త డంపింగ్
- పేరుకుపోతున్న నిల్వలు
- శాశ్వత పరిష్కారం చూపాలి .. అసెంబ్లీలో ఎమ్మెల్యే కడియం

**వరంగల్ వాయిస్ ప్రతినిధి :** నగరంలో పేరుకుపోతున్న చెత్తను ఊరవతలికి తరలించాలన్న లక్ష్యంతో వరంగల్ మహానగర పాలక సంస్థ పాలకవర్గం, అధికారులు 2013లో మడికొండ, రాంపూర్ గ్రామాల శివారులోని మొత్తం 33 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని ఎంపిక చేశారు. గ్రేటర్ పరిధిలోని సుమారు 13 లక్షల జనాభా ద్వారా నిత్యం వస్తున్న 400 నుంచి 500 టన్నుల చెత్తను డంపింగ్ యార్డుకు తరలించేలా ఏర్పాట్లు చేశారు. ఇందులో వంద టన్నుల వరకు వివిధ రీసైక్లింగ్ కేంద్రాలకు తరలిస్తున్నారు. అయితే అప్పటి నుంచి ఇప్పటి వరకు లక్షల టన్నుల చెత్త నిల్వలు పేరుకుపోయాయి. వాస్తవానికి 2021లో రూ.37 కోట్లకు లీప్ ఏకోటెక్ సంస్థకు బయో మైనింగ్ నిర్వహణ బాధ్యతలను అప్పగించారు. ఒప్పందం ప్రకారం డంపింగ్ యార్డులో పేరుకుపోయిన మూడు లక్షల టన్నుల చెత్తను బయోమైనింగ్ చేపట్టాల్సి ఉన్నప్పటికీ అందులో సగం కూడా పూర్తి కాలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**పొగచూరుతోంది..**

రాంపూర్ డంపింగ్ యార్డులో రీసైక్లింగ్ అటకెక్కింది. లక్షల మెట్రిక్ టన్నుల చెత్త పేరుకుపోయింది. దీంతో వాయి, జల కాలుష్యం జరిగి చుట్టు పక్కల గ్రామాలకు చెందిన పలువురు అనారోగ్యం బారిన పడుతున్నారు. మరి కొందరు శ్వాస సంబంధిత వ్యాధులతో మృత్యువాత పడుతున్నారు. డంపింగ్ యార్డునుంచి నిత్యం వస్తున్న పొగతో చుట్టు పక్కల గ్రామాల ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. సాయంత్రం అయిందంటే చాలు ఆ ప్రాంతమంతా దట్టమైన పొగతో నిండుకుంటోంది.



వరంగల్ వాయిస్, ఫైల్ ఫోటో

**దశాబ్ద కాలంగా ఉద్యమం..**

డంపింగ్ యార్డును తొలగించాలంటూ స్థానికులు, చుట్టు పక్కల గ్రామాల వారు దశాబ్ద కాలంగా ఉద్యమం చేస్తున్నారు. బల్దియాతో పాటు కలెక్టరేట్ లో నిర్వహించిన గ్రీవెన్స్ లో వినతులు సమర్పిస్తున్నారు. నేరుగా కమిషనర్, కలెక్టర్ ను కలిసి తమ సమస్యల గోడు వెళ్లబోసుకుంటున్నారు. పలు రాజకీయ నాయకులు ప్రజలకు అండగా నిలిచి ఉద్యమాలు చేస్తున్నారు. ధర్నాలు, రాస్తా రోకోలు నిర్వహిస్తూ తమ నిరసనను వ్యక్తం చేస్తున్నారు. ప్రజల కడుపు మండి ఉద్యమిస్తే త్వరలోనే సమస్యను పరిష్కరిస్తామంటూ హామీ ఇస్తున్న బల్దియా అధికారులు తర్వాత డంపింగ్ యార్డ్ సమస్యను అటకెక్కిస్తున్నారు.

### శాశ్వత పరిష్కారం చూపాలి : - కడియం శ్రీహరి, ఎమ్మెల్యే



మడికొండ డంపింగ్ యార్డ్ వల్ల చుట్టుపక్కల సుమారు 10గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి శాసనసభలో ప్రస్థావించారు. సాయంత్రం సమయంలో డంపింగ్ యార్డు నుంచి వెలువడే పొగతో ప్రజలు ఊపిరి తీసుకోలేని పరిస్థితి నెలకొందని వివరించారు. గతంలో వరంగల్, కరీంనగర్, హుజురాబాద్, పరకాల పట్టణాలకు ఉపయోగపడే విధంగా డంపింగ్ యార్డ్ ఏర్పాటుకు స్థల సేకరణ చేయాలని అధికారులకు సూచించినా ఇప్పటి వరకు డంపింగ్ యార్డ్ తరలింపు విషయంలో ఎలాంటి పురోగతి లేదన్నారు. గత ప్రభుత్వంలో ప్రయత్నించినా ఫలితం లేదని, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కూడా ఉమ్మడి వరంగల్ జిల్లా ఎమ్మెల్యేలు అందరూ ముఖ్యమంత్రిని కలిసి డంపింగ్ యార్డ్ సమస్యను వివరించినట్లు తెలిపారు. వరంగల్ నగర ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని వీలైనంత తొందరలో డంపింగ్ యార్డ్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే విధంగా సంబంధిత శాఖ మంత్రి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కడియం శ్రీహరి కోరారు.

# ప్రారంభమైన దేవాదుల మోటర్లు

- ధర్మసాగర్ రిజర్వాయర్ చేరిన నీరు
- మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పూజలు



**వరంగల్ వాయిస్, ధర్మసాగర్ :** దేవన్నపేట శివారులోని జె. చొక్కా రావు దేవాదుల ఎత్తిపోతల పథకం ఫేజ్–3, ప్యాకేజ్ –3 భాగంగా నూతనంగా నిర్మించిన దేవన్నపేట పంప్ హౌస్ మోటార్లను రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తో కలిసి రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, మాజీ ఉపముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఎమ్మెల్యేలు యశస్విని రెడ్డి, కేఆర్ నాగరాజు స్విచ్ ఆన్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పంప్ హౌస్ లోని మోటార్లను రాష్ట్ర మంత్రులు, ఉన్నతాధికారులు పరిశీలించారు. దేవాదుల పంప్ హౌస్ కు సంబంధించిన ఫేజ్ 1, 2, 3లకు సంబంధించిన వివిధ అంశాలపై సంబంధిత శాఖల ఉన్నతాధికారులు, అధికారులతో సమీక్షించారు. అనంతరం ధర్మసాగర్ రిజర్వాయర్ ను సందర్శించి నీటి విడుదలను పరిశీలించి గోదావరి జలాలకు ప్రత్యేక పూజలు చేశారు.



అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ దేవాదుల ప్రాజెక్టును పూర్తిస్థాయిలో ఫేజ్ 1,2,3లను పూర్తి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. పంపు హౌస్ లోని ఒక్క పంపును ఆన్ చేయడం ద్వారా సుమారు 600నుండి 650క్యూసెక్కుల నీరు విడుదల అవుతుందని తెలిపారు. దింతో స్టేషన్ ఘనపూర్, పాలకుర్తి, జనగామ, కొంత భాగం వర్ధన్నపేట నియోజకవర్గాలలోని పంటలకు సాగునీరు అందించవచ్చన్నారు. దేవాదుల ప్రాజెక్టు గత పదేళ్లుగా ఎందుకు పూర్తి కాలేదనే విషయం మనఅందరికీ తెలుసునని అన్నారు. రానున్న రోజులలో రాష్ట్రాన్ని సమస్యశ్యామలం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వెళ్తుందని పేర్కొన్నారు.

రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఇందిరమ్మ ప్రభుత్వానికి రైతుల పట్ల ఉన్న చిత్తశుద్ధి, కార్యదీక్ష ఎలా ఉంటుందో స్పష్టంగా చూస్తున్నారని అన్నారు. ఇందిరమ్మ ప్రభుత్వ హయంలోనే ఫేస్ త్రీ ని ప్రారంభించుకున్నామని మళ్లీ ఇందిరమ్మ ప్రభుత్వ హయాంలోనే పేజ్ 3 పూర్తి చేయబోతున్నట్లు చెప్పారు. గత ప్రభుత్వం కొత్త ప్రాజెక్టులపైనే మొత్తం నిధులు పెట్టారని, కొద్దిపాటి నిధులతో పూర్తి చేయవచ్చన్న ఆలోచన లేని కారణంగా దేవాదుల ప్రాజెక్ట్ ఆలస్యమైందన్నారు. గత ప్రభుత్వ హయాంలో దేవాదుల ప్రాజెక్ట్ నిర్లక్ష్యానికి గురైందన్నారు. ఎట్టి పరిస్థితులోనూ దేవాదుల ఫేజ్ 3 పంప్ హౌస్ ద్వారా నీరును అందించినట్లయితే 70వేల ఆయకట్టు పంటలను సురక్షితం చేయవచ్చని యుద్ధ ప్రాతిపదికన పంప్ హౌస్ మోటార్లను ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. దేవాదుల పంప్ హౌస్ మోటార్ల ప్రారంభోత్సవానికి విచ్చేసిన మంత్రులు ఉత్తంకుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజలు, రైతుల పక్షాన స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు, జనగామ ఎమ్మెల్యే యశశ్విని రెడ్డి, వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి, కుడా చైర్మన్ ఇనగల వెంకట్రాంరెడ్డి, హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, దేవాదుల, నీటి పారుదల శాఖ ఉన్నతాధికారులు, ఇతర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు

# రెడ్ క్రాస్ సేవలు అభినందనీయం

- హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** హనుమకొండ జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ పాలకవర్గ సమావేశం గురువారం రెడ్ క్రాస్ భవనంలో సొసైటీ చైర్మన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హనుమకొండ జిల్లా కలెక్టర్, రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షురాలు పి.ప్రావీణ్య హాజరయ్యారు. ప్రారంభ కార్యక్రమంలో కలెక్టర్ ను రెడ్ క్రాస్ పాలకవర్గ సభ్యులు పూల మొక్క అందించి సత్కరించారు. కలెక్టర్ రెడ్ క్రాస్ ఆవరణలో నిర్మాణంలో ఉన్న అదనపు భవనాన్ని పరిశీలించిన అనంతరం పాలకవర్గ సమావేశంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా రెడ్ క్రాస్ ఆదాయం, వ్యయాలను సమీక్షించి, పాలకవర్గ సభ్యులతో చర్చించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రక్తదాన కార్యక్రమమే కాకుండా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న రెడ్ క్రాస్ పాలకవర్గం సేవలు అభినందనీయమని ప్రశంసించారు. రెడ్ క్రాస్ అభివృద్ధికి అన్ని విధాలా సహకరిస్తానని తెలిపారు. ఈ సందర్భంగా రెడ్ క్రాస్ పాలకవర్గం కలెక్టర్ ను శాలువా, షీల్డ్ తో ఘనంగా సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ చైర్మన్ డాక్టర్ పి.విజయచందర్ రెడ్డి, వైస్ చైర్మన్ పెద్ది వెంకట నారాయణ గౌడ్, కోశాధికారి బొమ్మినేని పాపిరెడ్డి, రాష్ట్ర పాలకవర్గ సభ్యులు ఈవీ శ్రీనివాస్ రావు, సభ్యులు పుల్లూరు వేణు గోపాల్, డాక్టర్ ఎం.శేషుమాధవ్, పొట్లపల్లి శ్రీనివాస్ రావు, డాక్టర్ కె.సుధాకర్ రెడ్డి, డాక్టర్ హెచ్.సంధ్యారాణి, చెన్నమనేని జయశ్రీ, బిళ్ళ రమణా రెడ్డి, బాశెట్టి హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# బీసీల పోరు గర్జనను విజయవంతం చేద్దాం

## ◆ ఆరేగంటి నాగరాజు గౌడ్



**వరంగల్ వాయిస్, కేయూ:** బీసీ రిజర్వేషన్ల అమలుకు మద్దతుగా ఏప్రిల్ 2న ఢిల్లీలో నిర్వహించే బీసీల పోరు గర్జన విజయవంతం కావాలని బీసీ విద్యార్థి సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, కాకతీయ యూనివర్సిటీ ఇంచార్జ్ ఆరేగంటి నాగరాజు గౌడ్ ఆకాంక్షించారు. గురువారం కాకతీయ యూనివర్సిటీ పరిపాలన భవనం ముందు బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో పోరు గర్జన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ వేలాదిమంది విద్యార్థులు ఢిల్లీకి చీమలదండు వలె తరలి వచ్చి ఈ పోరాటాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ దేశవ్యాప్తంగా కుల గణన చేపట్టాలని, అలాగే తెలంగాణ రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్లను 42%కు పెంచుతూ అసెంబ్లీలో ఆమోదించిన బిల్లును కేంద్ర ప్రభుత్వం తక్షణమే పార్లమెంటులో ప్రవేశపెట్టి అమలు చేయాలని డిమాండ్ చేశారు.బీసీ ప్రధానిగా పదకొండేళ్లుగా ఉండి కూడా బీసీల అభివృద్ధికి ఏమాత్రం కృషి చేయకపోవడం బాధాకరం అని విమర్శించారు. ఇప్పటికైనా మోడీ బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసి, బడ్జెట్ నిధులు పెంచి, జనాభా తామాచిక ప్రకారం రిజర్వేషన్లు పెంచి, చట్టసభల్లో రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే, బీసీ మహిళలకు మహిళా బిల్లులో సబ్ కోటా ఇవ్వాలని, బీసీ ఉద్యోగులకు ప్రమోషన్ రిజర్వేషన్లు అమలు చేయాలని, క్రిమిలేయర్ ను రద్దు చేయాలని, జాతీయ స్థాయిలో బీసీ కుల గణన చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో రీసెర్చ్ స్కాలర్స్ రేగుల నరేష్, నామాల రవి స్వామి, బీసీ విద్యార్థి సంఘం మహిళా కన్వీనర్ జాహ్నవి, షైనీ, బీసీ విద్యార్థి సంఘం ఉపాధ్యక్షులు అజయ్ సింగ్, గణేష్, శ్రీ సాయి, వినోద్, అన్వేష్, అఖిల్, అలాగే ప్రీతి, అపూర్వ, రక్షిత, నికిత, హరిప్రియ, అశ్విత, తనుశ్రీ తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యనాథ స్వామి దేవాలయంలో పండగ ఉత్సవాలు



**వరంగల్ వాయిస్, ధర్మసాగర్:** మండలంలోని ముప్పారం గ్రామంలోని చారిత్రాత్మక ముఖ్యనాథ స్వామి దేవాలయంలో ఉగాది వేడుకలు ఘనంగా జరగనున్నాయి. మార్చి 30న ఉగాది సందర్భంగా ఆలయ ధర్మకర్తల ప్రమాణ స్వీకారం నిర్వహించనున్నట్లు ఆలయ వ్యవస్థాపక చైర్మన్ శివసాని రవీంద్ర తెలిపారు. ఈ కార్యక్రమంలో ముక్కునాథ స్వామి వారితో పాటు బద్ది పోచమ్మ తల్లికి ఉగాది పచ్చడి, బోనాలను సమర్పించనున్నారు. అదేవిధంగా, ఏప్రిల్ 6న శ్రీ ముఖ్యనాథ స్వామి దేవాలయంలో తొలి సారిగా శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవ వేడుకలు నిర్వహించనున్నారు. ఆలయ అభివృద్ధికి తోడ్పాటునిస్తూ, పురాతన దేవాలయాల ప్రాచీనతను చాటిచెప్పేందుకు ప్రముఖ నాట్య కళాకారిణి, టెంపుల్ డ్యాన్స్ ఫౌండర్ హిమాన్సి కాట్రగడ్డ తన శిష్య బృందంతో ఆలయంలో నృత్య ప్రదర్శన నిర్వహించారు. గత కొంతకాలంగా హిమాన్సి కాట్రగడ్డ నాట్య కళ ద్వారా రెండు తెలుగు రాష్ట్రాల్లోని పురాతన దేవాలయాలను వెలుగులోకి తెచ్చేందుకు కృషి చేస్తున్నారు. ఈ క్రమంలో, ముఖ్యనాథ స్వామి ఆలయంలో నిర్వహించిన నృత్య ప్రదర్శనను విశ్వావసు నామ సంవత్సర ఉగాది రోజున విడుదల చేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ పునఃనిర్మాణ వ్యవస్థాపక చైర్మన్ శివసాని ప్రవీణ్ రవీంద్ర, హిమాన్సి కాట్రగడ్డకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తూ, ఆమెకు ఆలయ జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ఉపాధ్యక్షుడు గుంటిపల్లి సంపత్ కుమార్, జాయింట్ సెక్రటరీ ఏతిరాజుల నరసింహస్వామి, సోషల్ మీడియా ఇంచార్జి మారబోయిన తిరుమల్, నాట్య కళా బృందంలోని కుందూరు అనిశ్రిత రెడ్డి, అనన్య రెడ్డి, దుంపేటి అన్విక, ఇతర భక్తులు పాల్గొన్నారు.

# జై సంవిధాన్ కార్యక్రమాన్ని గడపగడపకు తీసుకెళ్లాలి



**వరంగల్ వాయిస్, నడికూడ :** ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం జై బాపూ, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమాన్ని గడపగడపకు తీసుకెళ్లాలని నడికూడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బుర్ర దేవేందర్ గౌడ్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. గురువారం ఏఐసీసీ, పీసీసీ, డీసీసీ ఆదేశాల మేరకు పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి ఆదేశానుసారం నడికూడ మండలంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ అభియాన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దేవేందర్ గౌడ్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవడానికి కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకులు రాహుల్ గాంధీ జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ అభియాన్ కార్యక్రమం తీసుకొచ్చారన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సారథ్యంలో ప్రతి నియోజకవర్గం పరిధిలోని మండల, గ్రామస్థాయి వరకు ఈ కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో బలంగా తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. బీజేపీ కేంద్ర ప్రభుత్వం స్వాతంత్ర సమరయోధులను, భారత రాజ్యాంగాన్ని, మానవ హక్కులను అవమానపరిచే విధంగా ఉందన్నారు. జై బాపూ, జై భీమ్, జై సంవిధాన్ అభియాన్ కార్యక్రమాన్ని ప్రతి గడపగడపకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి డాక్టర్ మలహాల్ రావు, నడికూడ మండల మాజీ జడ్పీటీసీ కోడెపాక సుమలత కర్ణాకర్, పాడి కల్పనా దేవి ప్రతాప్ రెడ్డి, సమన్వయ కమిటీ సభ్యులు పర్నెం మల్లారెడ్డి, పెద్దబోయిన రవీందర్ యాదవ్, తిరుపతి రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఈర్ల చిన్ని, గ్రామ కమిటీ అధ్యక్షులు, వివిధ కమిటీ సభ్యులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ సమైక్యతతోనే ప్రపంచ శాంతి




## ■ డాక్టర్ పరికిపండ్ల అశోక్

**వరంగల్ వాయిస్, మహబూబాబాద్:** హిందూ–ముస్లిం భాయ్ భాయ్ అని ప్రతిపాదిస్తూ, ఒక మనిషి మరొక మనిషికి రక్షణగా నిలవాలని, ప్రతి మతం ఇతర మతాలను గౌరవించుకోవాలని సందేశమిస్తూ, ప్రపంచ శాంతిని లక్ష్యంగా రంజాన్ పవిత్ర మాసాన్ని పురస్కరించుకొని జాతీయ సమైక్యత సంఘటన్ ఆధ్వర్యంలో మతసామరస్య రక్షాబంధన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గురువారం జరిగిన ఈ కార్యక్రమంలో సంఘటన్ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ పరికిపండ్ల అశోక్, జిల్లా కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ సమీపంలోని మసీదులో ముస్లిం సోదరులకు రాఖీలు కట్టి మతసామరస్యాన్ని చాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 2015లో మాజీ రాష్ట్రపతి, మహారాష్ట్రలోని జల్గాం నివాసి ప్రతిభా దేవి సింగ్ పాటిల్ ప్రారంభించిన జాతీయ సమైక్యత సంఘటన్ సంస్థ ప్రతి సంవత్సరం వివిధ కులమతాల పండుగల సందర్భంగా “ఒక మతానికి మరొక మతం రక్షణ” అనే నినాదంతో మతసామరస్య రక్షాబంధన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులకు పండ్ల పంపిణీ కూడా నిర్వహించారు. కార్యక్రమంలో “నేను సైతం” స్వచ్ఛంద సేవా సంస్థ అధినేత షేక్ సుభాని, ముస్లిం మత పెద్దలు, కాంగ్రెస్ జిల్లా నాయకులు మహమ్మద్ వహీద్, అమీర్, షేక్ మహబూబ్, జాకీర్, భాష, ఇమాంపాషా, నయీమ్, అక్బర్, హుస్సేన్, జానీ మియా, అలాగే ఆరోగ్య మిత్ర స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి పరికిపండ్ల సహజ పాల్గొన్నారు.

# రాంచంద్రనాయక్‌కు మంత్రి పదవి ఇవ్వాలి

## బత్తుల శ్రీనివాస్ యాదవ్



**వరంగల్ వాయిస్, డోర్నకల్:** స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ రాంచంద్రనాయక్‌కు మంత్రి పదవి ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ బత్తుల శ్రీనివాస్ యాదవ్ అన్నారు. రాష్ట్రంలో 32 లక్షల లంబాడీ జనాభా ఉన్నప్పటికీ, వారు ఇందిరా గాంధీ హయాం నుండి కాంగ్రెస్ పార్టీని తమకు నమ్మకమైన పార్టీగా భావిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ప్రత్యేకంగా, ఉమ్మడి వరంగల్ జిల్లాలోని డోర్నకల్ నియోజకవర్గం, వైఎస్ఆర్ కుటుంబానికి పులివెందుల ఎంతటి కంచుకోటగా ఉంటే, అదే స్థాయిలో కాంగ్రెస్ చరిత్రలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించిందన్నారు. ఇప్పటివరకు, ఈ ప్రాంతానికి చెందిన ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన నేతలు రెడ్యానాయక్, సత్యవతి మంత్రిగా బాధ్యతలు నిర్వహించారని ఆయన గుర్తు చేశారు. ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తూ, తక్కువ కాలంలోనే ప్రజల మన్ననలు పొందిన జాటోత్ రాంచంద్రనాయక్, 53 వేల ఓట్ల భారీ మెజారిటీతో విజయం సాధించడం ఓ రికార్డు అని ఆయన పేర్కొన్నారు. అన్ని విషయాలను పరిగణనలోకి తీసుకుని, మంత్రివర్గ విస్తరణలో రాంచంద్రనాయక్‌కు తప్పకుండా చోటు కల్పించాలని డాక్టర్ బత్తుల శ్రీనివాస్ యాదవ్ డిమాండ్ చేశారు. విద్యావంతుడు, వినయశీలుడు, ప్రజా సమస్యల పట్ల కట్టుబాటు కలిగిన నాయకుడైన రాంచంద్రనాయక్‌కు మంత్రి పదవి ఇచ్చి, ఈ ప్రాంత అభివృద్ధికి అవకాశం కల్పించాలని ప్రభుత్వాన్ని, పార్టీ అధిష్టానాన్ని కోరారు.

# రేపు ఆరోగ్య శాఖ మంత్రితో భేటీ



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** రేపు హైదరాబాద్‌లోని బంజారాహిల్స్ మినిస్టర్ క్వార్టర్స్‌లో ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహతో భేటీ కానున్నట్లు జాతీయ ఆరోగ్య మిషన్ కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ (ఏఐటీయూసీ అనుబంధం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర్ రాజనర్సింహ ఉదయం 9 గంటలకు మినిస్టర్ క్వార్టర్స్‌లో ప్రతి జిల్లా నుంచి ఇద్దరు ప్రతినిధులు హాజరుకావచ్చన్నారు. జాతీయ ఆరోగ్య మిషన్ ఉద్యోగులందరూ భారీ సంఖ్యలో హాజరై భేటీని విజయవంతం చేయాలని, తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.

# బాధిత కుటుంబాలకు పరామర్శ



**వరంగల్ వాయిస్, తొర్రూరు:** రాయపర్తి మండలం పాణ్య నాయక్ తండాకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఆంగోతు యాకుబ్ తండ్రి ఆంగోతు దేవోజి ఇటీవల అనారోగ్యంతో మరణించగా, గురువారం పాలకుర్తి నియోజకవర్గ ఇంచార్జి ఝాన్సీ రాజేందర్ రెడ్డి వారి కుటుంబాన్ని పరామర్శించారు. అలాగే, జయరాం తండా గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ నాన్నమ్మ బీకీ మరణించగా, ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సహాయం అందించారు. జగన్నాథపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు మచ్చ కుమార్ తండ్రి మచ్చ కొమురయ్య అనారోగ్యంతో మరణించగా, ఈ రోజు వారి కుటుంబాన్ని పరామర్శించారు. రాయపర్తి మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు కసరబోయిన కొమురయ్య ఇటీవల అనారోగ్యంతో మరణించగా, ఆయన కుటుంబాన్ని పరామర్శించి, ఆర్థిక సహాయం అందించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. మండల కేంద్రానికి చెందిన కసరబోయిన (తుమ్మల) సాయమ్మ కుటుంబాన్ని పరామర్శించారు. మండల కేంద్రానికి చెందిన గుడమాల వెంకన్న ప్రమాదవశాత్తు గాయపడగా, చికిత్స అనంతరం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న ఆయనను పరామర్శించి, కుటుంబ సభ్యులతో ఆరోగ్య పరిస్థితిని గురించి విచారించి, ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా, ఝాన్సీ రాజేందర్ రెడ్డి వెంట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు హమ్య నాయక్, మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్ రెడ్డి, పార్టీ ముఖ్య నాయకులు మాచర్ల ప్రభాకర్, భూక్యా సమ్మయ్య నాయక్, ఇతర స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# రైతులకు మజ్జిగ పంపిణీ



**వరంగల్ వాయిస్, వరంగల్ :** రోజు రోజుకు పెరుగుతున్న ఎండల తీవ్రత కారణంగా రైతులు, గుమస్తాలు, కార్మికులు, వ్యాపారస్తులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, వరంగల్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్ రెడ్డి, వ్యవసాయ మంత్రి, వ్యవసాయ మార్కెట్ కమిటీ అధికారులు, జిల్లా కలెక్టర్ ను సంప్రదించి, మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ చేపట్టాలని అభ్యర్థించారు. ఈ మేరకు గురువారం నుంచి మే నెలాఖరు వరకు ఎండల తీవ్రత అధికంగా ఉండే రోజుల్లో మజ్జిగ ప్యాకెట్ల పంపిణీని ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని రీజనల్ జాయింట్ డైరెక్టర్ ఆఫ్ మార్కెటింగ్ శ్రీ ఉప్పుల శ్రీనివాస్, సెలక్షన్ గ్రేడ్ కార్యదర్శి జి.రెడ్డి, ఇతర మార్కెటింగ్ అధికారులు, వరంగల్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్ రెడ్డి వారి కార్యవర్గ సభ్యుల సమక్షంలో ప్రారంభించారు. ఈ 4000 మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ కార్యక్రమానికి చాంబర్ ప్రధాన కార్యదర్శి మడూరి వేద ప్రకాష్, కోశాధికారి అల్లే సంపత్, కాటన్ సెక్షన్ అధ్యక్షుడు చింతలపల్లి వీరా రావు, అడ్తి సెక్షన్ అధ్యక్షులు ఎన్.రెడ్డి లింగారెడ్డి, గుమస్తా సంఘం అధ్యక్షులు ఎనుముల మల్లేశం, వారి కార్యవర్గ సభ్యులు, హమాలి కార్మిక సంఘాల ప్రతినిధులు, ఇతర ప్రముఖులు హాజరయ్యారు.

# ఆర్ట్స్ కళాశాలలో ఇఫ్తార్ విందు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** సుబేదారిలోని కాకతీయ విశ్వవిద్యాలయం ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో బుధవారం రాత్రి కళాశాల క్యాంటీన్ లో ఎన్జీవో సంఘం ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య. సుంకరి జ్యోతి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ జ్యోతి మాట్లాడుతూ ముస్లిం సోదరులు 45 రోజులపాటు పవిత్రంగా జరుపుకునే పండుగలలో రంజాన్ చాలా ముఖ్యమైందని. కళాశాలలో అన్ని పండుగలను ఘనంగా నిర్వహిస్తున్నామని హిందూ ముస్లిం, క్రిస్టియన్ సాంప్రదాయాలను గౌరవిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో లా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుదర్శన్, మహిళా పీజీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మధుశ్రీ, డాక్టర్.అసీం ఇక్బాల్, డాక్టర్ ఫిరోజ్, ఆర్ట్స్ కళాశాల ఎన్జీవో సంఘం అధ్యక్షులు రాజు, ప్రధాన కార్యదర్శి సుశీల్ కళాశాల బోధ నేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేద కుటుంబానికి బియ్యం అందజేత

**వరంగల్ వాయిస్, ఆత్మకూర్:** మండలంలోని నీరుకుల్లా గ్రామానికి చెందిన వేల్పుల సాంబలక్ష్మి కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ సర్పంచ్ ఉడుత సంగీత మహేందర్ 50 కేజీల బియ్యాన్ని అందించారు. ఈ సందర్భంగా సంగీత మహేందర్ మాట్లాడుతూ కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని, వారి సంక్షేమం కోసం ఎప్పుడూ ముందుండాలని సంకల్పించుకున్నానని తెలిపారు. కార్యకర్తలకు ఏ సమస్య వచ్చినా తాను అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సోషల్ మీడియా మండల అధ్యక్షుడు, పీఏసీఎస్ డైరెక్టర్ ఉడుత రాజేందర్, మాజీ ఎంపీటీసీ హర్షం వరుణ్ గాంధీ, యువ నాయకులు ఉడుత మాధవ్, గ్రామ సోషల్ మీడియా కోఆర్డినేటర్ న్యాతకాని ప్రదీప్, కాంగ్రెస్ నాయకులు నాగారపు మొగిలి తదితరులు పాల్గొన్నారు.

# బైక్ ప్రమాదం నిందితుడికి జైలు శిక్ష

**వరంగల్ వాయిస్, ఆత్మకూర్ :** ద్విచక్ర వాహనాన్ని అతివేగంగా అజాగ్రత్తగా నడిపి ఒకరి మృతికి కారణమైన నిందితుడికి జైలు శిక్ష పడింది. ఆత్మకూర్ సీఐ సంతోష్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని పెంచికలపేట గ్రామానికి చెందిన నామాల రాజేష్ 2021 సంవత్సరంలో తన హీరో హోండా గ్లామర్ బైక్ పై వెళుతూ నీరుకుల క్రాస్ రోడ్ వద్ద కాలినడకన వెళ్తున్న హర్షం ఇఫ్తార్ ను ఢీ కొట్టి ఆయన మృతికి కారణమైన సంఘటనలో ఆత్మకూరు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసు పరకాల కోర్టు విచారించి నిందితుడు నామాల రాజేష్ కు ఏడాడి పాటు జైలు శిక్ష, రూ. 5000 జరిమానాను విధిస్తూ జడ్జి శాలిని లింగం తీర్పు ఇచ్చారు. సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టి, నిందితుడు రాజేష్ కి శిక్షపడేలా ఏపీపీ రుధిర కృషి చేశారు. కేసు విచారణలో నిందితునికి శిక్షపడేలా విధులను వ్యవహరించిన జె శీను శ్రీనివాస ప్రసాద్ ను పరకాల ఏసీపీ సతీష్ బాబు, సీఐ సంతోష్ అభినందించారు.

# మద్ది కాయల ఓంకార్ శతజయంతి వార్షికోత్సవాలు

- మే 12న మచ్చాపూర్ స్తూపం వద్ద ప్రారంభ సభ
- ఎంసీపీఐ (యూ) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఎంసీపీఐ (యూ) వ్యవస్థాపక నేత, అమరజీవి కామ్రేడ్ మద్ది కాయల ఓంకార్ శతజయంతి వార్షికోత్సవాలు మే 12, 2024 నుంచి మే 12, 2026 వరకు రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా నిర్వహించనున్నట్లు ఎంసీపీఐ (యూ) తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి తెలిపారు. ఈ మేరకు వరంగల్‌లో జరిగిన ఎంసీపీఐ (యూ) ఉమ్మడి జిల్లా ముఖ్య కార్యకర్తల జనరల్ బాడీ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ భూమి భుక్తి విముక్తి కోసం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో కీలకపాత్ర పోషించిన ఎంసీపీఐ (యూ) వ్యవస్థాపక నేత, అసెంబ్లీ టైగర్‌గా పేరుగాంచిన కామ్రేడ్ మద్ది కాయల ఓంకార్ 1926 మే 12న సూర్యాపేట జిల్లా ఏపూరు గ్రామంలో జన్మించారని, ఆయన శతజయంతి సందర్భంగా మే 12న మచ్చాపూర్ స్తూపం వద్ద ప్రారంభ సభ జరగనున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా గాదగోని రవి మాట్లాడుతూ కామ్రేడ్ ఓంకార్ ప్రజల హక్కుల కోసం అనేక పోరాటాలు నిర్వహించారని, ఆయన ఆత్మత్యాగాన్ని ప్రజలకు వివరించి, దోపిడీ పాలకవర్గానికి వ్యతిరేకంగా, మనిషిని మనిషి దోపిడీ చేయని సమాజ నిర్మాణం కోసం పోరాటాలను ముమ్మరం చేయాలని యంసిపిఐ (యు) శ్రేణులను పిలుపునిచ్చారు. మే 12న మచ్చాపూర్ స్తూపం వద్ద జరిగే శతజయంతి సభకు ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కోరారు. దేశవ్యాప్తంగా ఎంసీపీఐ (యూ) ఏర్పడి 41 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా గాదగోని రవి మాట్లాడుతూ, పార్టీ అనేక నిర్బంధాలు, జైలు జీవితాన్ని ఎదుర్కొంటూనే 150 మందికి పైగా నాయకులు, కార్యకర్తలు ప్రాణాలు కోల్పోయారని, అటువంటి త్యాగాల స్ఫూర్తితో పార్టీని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. కామ్రేడ్ ఓంకార్ శతజయంతి ఉత్సవాలను విజయవంతం చేసేందుకు నిర్వహణ కమిటీని ఏర్పాటు చేశారు. గౌరవ అధ్యక్షుడిగా వల్లెపు ఉపేందర్ రెడ్డి, అధ్యక్షుడిగా గోనె కుమారస్వామి, ప్రధాన కార్యదర్శిగా పెద్దారపు రమేష్, కోశాధికారిగా మంద రవి, ఉపాధ్యక్షులుగా ఎన్. రెడ్డి, హంసారెడ్డి, గుండెబోయిన చంద్రయ్య, కన్నం వెంకన్న, కుసుంబ బాబూరావు, నీల రవీందర్, గడ్డం నాగార్జున, నాగెల్లి కొమరయ్య, వంగల రాగసుధ, రాజా సాహెబ్ లు ఎన్నికయ్యారు. కార్యదర్శులుగా కంచ వెంకన్న, నర్ర ప్రతాప్, కర్ర రాజిరెడ్డి, మాలి బాబురావు, నూకల ఉపేంద్ర, మాస్ సావిత్రి, కోట నర్సింహారెడ్డి, జగదీశ్వర్ లు బాధ్యతలు స్వీకరించారు. వల్లెపు ఉపేందర్ రెడ్డి, వరికుప్పల వెంకన్న, గోనె కుమారస్వామి, ఎన్.రెడ్డి, హంసారెడ్డి, మంద రవి, నర్ర ప్రతాప్, కంచ వెంకన్న, మాలోత్ జబ్బార్ నాయక్, కన్నం వెంకన్న, నేల రవీందర్, గడ్డం నాగార్జున, మాస్ సావిత్రి, నూకల ఉపేంద్ర, నాగెల్లి కొమరయ్య, కర్ర రాజిరెడ్డి తదితర నాయకులు, జిల్లా, డివిజన్, మండల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# ఫొటో దిగిన.. పౌష్టికాహారం అందలే..!


## పోషన్ ట్రాకర్ యాప్ తో సమస్యలు



**వరంగల్ వాయిస్, డోర్నకల్:** అంగన్వాడీ కేంద్రాల బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం నూతన చర్యలు చేపట్టింది. 6 నెలల నుంచి 3 సంవత్సరాల వయస్సు కలిగిన పిల్లలు, గర్భిణీలు, బాలింతలకు బాలమృతం, గుడ్లు, పౌష్టికాహారం సరైన విధంగా అందించేందుకు కట్టుదిట్టమైన వ్యవస్థను అమలు చేస్తోంది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన “పోషన్ ట్రాకర్” యాప్‌ను ఉపయోగించబడుతోంది. ఈ యాప్ ద్వారా అంగన్వాడీ కేంద్రాల్లో లబ్ధిదారుల వివరాలు టీచర్లు లాగిన్ చేసి అప్లోడ్ చేస్తున్నారు. అనంతరం ప్రతి నెలా పౌష్టికాహారం అందించడానికి చిన్నారి తల్లి ఫేస్ రీడింగ్ తప్పనిసరి చేయబడింది. అయితే మారుమూల గిరిజన గ్రామాల్లో సెల్‌ఫోన్ సిగ్నల్ సరిగ్గా అందకపోవడం, ముఖ్యంగా 2జీ సిమ్‌లను మాత్రమే వినియోగించడం వల్ల అంగన్వాడీ టీచర్లకు ఈ ప్రక్రియను పూర్తిచేయడం కష్టంగా మారింది. ఫోటో అప్ లోడ్ అవ్వాల్సిన సమయంలో సిగ్నల్ సమస్య తలెత్తడంతో, తల్లులు ఆహారం అందుకోలేక వెనుదిరిగి పోతున్నారు. అంగన్వాడీ టీచర్లు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఫిడింగ్ ఇవ్వలేమని చెబుతున్నారు. ఈ సమస్యను పరిష్కరించి, తల్లులకు పౌష్టికాహారం అందేలా చర్యలు తీసుకోవాలని వారు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

# సబ్సిడీ యంత్రాలకై దరఖాస్తు చేసుకోండి

## ఏవో పోరిక జై సింగ్



**వరంగల్ వాయిస్, నడికూడ :** వ్యవసాయ యాంత్రీకరణ పథకం క్రింద సబ్సిడీ వ్యవసాయ యంత్ర పరికరాల కోసం మహిళా రైతులు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి పోరిక జై సింగ్ తెలిపారు. పట్టా పాస్ పుస్తకాలు కలిగిన మహిళా రైతులకు మాత్రమే 50శాతం సబ్సిడీపై వ్యవసాయ యంత్ర పరికరాలుఅందించ బడుతుందని, ఈ పథకం కింద మన నడికూడ మండలానికి 5– బ్యాటరీ స్ప్రేయర్లు జనరల్ –3, ఎస్టీ –2,5–పవర్ స్ప్రేయర్లు జనరల్ 4, ఎస్టీ –1, 2 రోటవేటర్లు జనరల్ –1, ఎస్సీ –1,3–ట్రాక్టర్ కు సంబంధించిన యంత్ర పరికరాలు జనరల్ కు కేటాయించారని తెలిపారు. జిల్లా పరిధిలో 1–డ్రోన్ జనరల్ , నియోజకవర్గ పరిధిలో పవర్ టిల్లర్–1 ఎస్టీ, ట్రాక్టర్ –1జనరల్, బండ్ ఫార్మర్–1జనరల్–, పవర్ విడర్–1జనరల్, బ్రష్ కట్టర్–1జనరల్, స్ట్రా బేలర్–1జనరల్ కేటాయించినట్లు తెలిపారు. అర్హత గల మహిళా రైతులు దరఖాస్తుతో పాటు పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం,పాస్ పోర్ట్ సైజ్ ఫోటో, ట్రాక్టర్ కు సంబంధించిన యంత్ర పరికరాలకు రిజిస్ట్రేషన్ పేపర్ తో సహా దరఖాస్తును మండలంలోని వ్యవసాయ అధికారి కార్యాలయం, రైతు వేదికలో ఈనెల 29వ తేదీలోగా అందజేయాలని తెలిపారు.

# దేవాదుల అభివృద్ధిలో కడియం పాత్ర లేదు

- మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య



**వరంగల్ వాయిస్, స్టేషన్ ఘనపూర్ :** దేవాదుల ప్రాజెక్ట్ మూడో దశ నీటి విడుదలపై మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య మీడియాతో మాట్లాడుతూ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా ఆయన, దేవాదుల ప్రాజెక్ట్‌కు సంబంధించి కడియం శ్రీహరి ఎలాంటి పాత్ర పోషించలేదని స్పష్టం చేశారు. ప్రాజెక్ట్ తొలి రెండు దశల అభివృద్ధిలో కూడా కడియం సహకారం లేకపోయిందని విమర్శించారు.

కడియం శ్రీహరికి దేవాదుల అభివృద్ధిలో పాత్ర లేదని రాజయ్య ఆరోపించారు. స్టేషన్ ఘనపూర్‌కు దేవాదుల ద్వారా నీరు అందించడానికి కడియం శ్రీహరి ఎలాంటి కృషి చేయలేదని రాజయ్య అన్నారు. గత 15 ఏళ్లలో కడియం శ్రీహరి ఈ ప్రాజెక్ట్ కోసం కనీసం ఏ విధమైన చర్యలు తీసుకోలేదన్నారు. అయితే, ఇప్పుడు ఆయన దేవాదుల ప్రాజెక్ట్ సృష్టికర్తగా చెప్పుకోవడం విచిత్రమని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. కడియం శ్రీహరి మాటలను నమ్మి సీఎం, మంత్రులు మోసపోవద్దని హెచ్చరించారు. ఇటీవల స్టేషన్ ఘనపూర్‌లో జరిగిన రేవంత్ రెడ్డి సభ భయభ్రాంతుల్లో జరిగిందని రాజయ్య వ్యాఖ్యానించారు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలను రాళ్లతో కొట్టాలని రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు తీవ్ర వివాదాస్పదమని పేర్కొన్నారు. ఇదే రేవంత్ రెడ్డి ఇప్పుడు ఆ ఫిరాయించిన ఎమ్మెల్యేలను వెనకేసుకొస్తున్నారని ప్రశ్నించారు.

WARANGALVOICE
www.epaper.warangalvoice.net
www.warangalvoice.net
వరంగల్ వాయిస్ Evening Daily
GRATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet
గురువారం, మార్చి 27, 2025

# శివాలయం పునర్నిర్మాణానికి విరాళాల వెల్లువ

## ➲ ముందుకొస్తున్న దాతలు



**వరంగల్ వాయిస్, చిట్యాల :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలంలోని నవాబుపేట గ్రామం తాజా మాజీ సర్పంచ్ కసిరెడ్డి సాయిసుధ-రత్నాకర్ రెడ్డి నేతృత్వంలో అనతి కాలంలోనే అభివృద్ధి చెందింది. ఈ క్రమంలో గ్రామంలో పురాతనమైన శివాలయం శిథిలావస్థకు చేరడంతో తాజా మాజీ సర్పంచ్ సాయి సుధ భర్త రత్నాకర్ రెడ్డి గ్రామస్తులనంతా ఏకం చేసి నూతన శివాలయ పునర్నిర్మాణ కమిటీని వేశారు. ఆయన పిలుపు మేరకు గ్రామ ప్రజలంతా ఏకమై శివాలయ పునర్నిర్మాణానికి అత్యధిక మొత్తంలో విరాళాలను ఇవ్వడం గమనార్హం. ఈ క్రమంలో గ్రామానికి చెందిన కాల్వ సుగుణమ్మ కుమారులు కాల్వ రమేష్ రెడ్డి, కాల్వ సురేష్ రెడ్డి బ్రదర్స్ శివాలయ పునర్నిర్మాణానికి రూ.1,00,116 విరాళం ఇచ్చారు. ఈ సందర్భంగా వారిని ఆలయ కమిటీ చైర్మన్ కసిరెడ్డి రత్నాకర్ రెడ్డి, ఉపాధ్యక్షులు మోత్కూరి నరేష్, ప్రధాన కార్యదర్శి సర్వ శరత్ కుమార్, కోశాధికారి మందల రాఘవరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు కొక్కుల సారంగం, తీగల నాగరాజు, తిప్పణవేణి రవి, బొమ్మ శంకర్ గౌడ్, అనగాని రాజయ్య, మోత్కూరి రాజు, కాల్వ సమ్మిరెడ్డి, కసిరెడ్డి వెంకట కృష్ణారెడ్డి, చెక్క నర్సయ్యలు అభినందించగా.. ఆలయ అర్చకులు రఘునందన్ శర్మ కాల్వ సుగుణమ్మ కుమారులకు ధన కానుక, వస్తు, వాహన ప్రాప్తిరస్తు కలగాలని, వారు నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో, పిల్లాపాపలతో, సుఖ సంతోషాలతో ఉండేలా అనుగ్రహం కల్పించాలని ఆ దేవదేవున్ని ఆకాంక్షించినట్లు రఘునందన్ శర్మ తెలిపారు.

# ఆస్తి పన్ను వడ్డీ రాయితీ గడువు పెంచాలి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** మహానగర పాలక సంస్థ పరిధిలో ఉన్న ఇంటి యజమానులు కట్టవలసిన పేరుకుపోయిన ఆస్త పన్నుకు విధించిన వడ్డీలో 90 శాతం మినహాయింపు రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వడం బీదవారికి ఎంతో మేలు జరుగుతుందని 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన విధానం సరైనదని కానీ వేలాది రూపాయలు చెల్లించాలన్న కొంత సమయం అవసరమని ఈనెల చివరి రోజులలో ఉగాది, రంజాన్ పండుగలు ఉన్నాయన్నారు. ఈ పండుగలకు ఖర్చులు అధికంగా అయితాయని దీని వలన నిరుపేదలు ప్రభుత్వం ప్రకటించిన రాయితీని వినియోగించుకోలేక పోతారని ప్రభుత్వం ఇప్పటికైనా ఏప్రిల్ చివరి వరకు గడువు ఇచ్చినచో ఏదో విధంగా నిరుపేదలు ఆస్తి పన్నులు చెల్లిస్తారని పేర్కొన్నారు. కాబట్టి, ప్రభుత్వం ఒక నెల గడువు ఇవ్వాలని కోరారు.

# నాయి బ్రాహ్మణుల నిరాహార దీక్ష



**వరంగల్ వాయిస్, భూపాలపల్లి :** జిల్లా కేంద్రంలో కార్పొరేట్ సంస్థలు సెలూన్ షాప్ ఏర్పాటు చేయటాన్ని నిరసిస్తూ నాయి బ్రాహ్మణుల ఆధ్వర్యంలో గురువారం భూపాలపల్లి అంబేద్కర్ సెంటర్ దగ్గర నిరాహార దీక్షలు ప్రారంభించారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం నాయకులు భీమనాథుని సత్యనారాయణ హాజరై వారికి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా కులవృత్తులు, చేతివృత్తుల వారికి ఎలాంటి ఉపాధి లేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కార్పొరేట్ సంస్థలు సెలూన్ షాపులు ఏర్పాటు చేస్తే నాయి బ్రాహ్మణుల ఉపాధి కరువై వారి కుటుంబాలు రోడ్డున పడతాయని ఆవేదన వ్యక్తం చేశారు. కాబట్టి, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కార్పొరేట్ సెలూన్ షాపులకు అనుమతి వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే చేతివృత్తుల వారు కులవృత్తుల వారికి రాష్ట్ర ప్రభుత్వం రూ. 5లక్షల వరకు వడ్డీ లేని రుణాలు అందించి బీసీలను ఆదుకోవాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని కోరారు. అన్ని రాజకీయ పార్టీలు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల వారు ఒక్కటై కార్పొరేట్ సంస్థలకు వ్యతిరేకంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు.

# ఎమ్మెల్యే మురళి నాయక్ కు మంత్రి పదవి రావాలి




## ■ 101 కొబ్బరికాయలు కొట్టి పూజలు

**వరంగల్ వాయిస్, మహబూబాబాద్:** మానుకోట ఎమ్మెల్యే డాక్టర్ బి. మురళి నాయక్‌కు మంత్రి పదవి కల్పించాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు, రాష్ట్ర బీసీ నేత శంతన్ రామరాజు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా స్థానిక ముత్యాలమ్మ గుడిలో 101 కొబ్బరికాయలు కొట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ నాయకుడు కమ్మగాని కృష్ణమూర్తి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా శంతన్ రామరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర మంత్రివర్గ విస్తరణలో ఎమ్మెల్యే మురళి నాయక్‌కు చోటు కల్పించాలని అధిష్ఠానానికి విజ్ఞప్తి చేశారు. మురళి నాయక్ నియోజకవర్గ చరిత్రలో ఎప్పుడూ లేనివిధంగా అత్యధిక మెజారిటీతో గెలిచి ప్రజాహృదయాలను గెలుచుకున్న గొప్ప నాయకుడని కొనియాడారు. ఇలాంటి యువ నాయకుడికి మంత్రిపదవి లభిస్తే మానుకోట అభివృద్ధిలో నూతన యుగానికి దారి తీస్తుందన్నారు. గత ఏడాది నుంచి నియోజకవర్గ సమస్యలపై అహర్నిశలు కృషి చేస్తున్న మురళి నాయక్‌కు మంత్రిపదవి దక్కితే విద్య, వైద్య, వ్యాపార, పర్యాటక రంగాల్లో మానుకోట మరింత పురోగమిస్తుందని తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన మానుకోటకు మరిన్ని నిధులు రావాలంటే, బడుగు బలహీనవర్గాల అభ్యున్నతి సాధించాలంటే మురళి నాయక్‌కు మంత్రి పదవి తప్పనిసరి అని శంతన్ రామరాజు స్పష్టం చేశారు. నిత్యం నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడే మురళి నాయక్ మంత్రి అయితే ప్రజల సంక్షేమం మరింత మెరుగవుతుందనే నమ్మకాన్ని వ్యక్తం చేశారు. ముత్యాలమ్మ తల్లి ఆశీస్సులతో మురళి నాయక్‌కు మంత్రిపదవి లభిస్తుందనే విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గుగులోత్ రాములు నాయక్, సోమారపు వీరస్వామి, సిరిపురం వీరు, బంజెర వెంకట్ రెడ్డి, గోనె శ్యామ్, నరేష్ రెడ్డి, కోలా సత్యం, కొండి సాయికిరణ్, ఆల్వాల లాలయ్య, మల్లేష్, గుంజె హన్మంతు, గుగులోత్ చెక్రు, నారాయణ్ సింగ్ పాల్గొన్నారు.

# మంత్రివర్గ విస్తరణలో బీసీలకు మంత్రి పదవులివ్వాలి

## ముగ్గురు బీసీలకు అవకాశం కల్పించండి

## బీసీ నేత వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** విద్యా, ఉద్యోగ, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం వాటా కల్పిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం మంత్రివర్గ విస్తరణలో కూడా 42 శాతం వర్తింపచేయాలని బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించినట్లుగానే మంత్రివర్గ విస్తరణలో సైతం బీసీల జనాభా ప్రాతిపదికన మంత్రి పదవులను కేటాయించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన కులగణనలో బీసీలు 56 శాతం ఉంటే బీసీలకు గత మంత్రివర్గ విస్తరణలో ఇద్దరికి మాత్రమే అవకాశం కల్పించి, 5 శాతం ఉన్న రెడ్లకు మాత్రం నలుగురికి అవకాశం కల్పించారన్నారు. ప్రస్తుతం చేపట్టబోయే నాలుగు మంత్రివర్గ విస్తరణలో మళ్లీ రెడ్లకు రెండు, బీసీలకు కేవలం ఒక్కటి మాత్రమే కేటాయిస్తామని లీకులు ఇవ్వడం ఎంత వరకు సమంజసమని వేణుగోపాల్ గౌడ్ ప్రశ్నించారు. త్వరలో చేపట్టబోయే మంత్రివర్గ విస్తరణలో బీసీలకు ముగ్గురికి అవకాశం కల్పించి బీసీల పైన చిత్తశుద్ధి నిరూపించుకోవాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కోరారు.

# బీఆర్ఎస్ హయాంలోనే అడుగడుగున భూ కబ్జాలు

## ■ యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి తోట పవన్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వరంగల్ పశ్చిమ నియోజవర్గంలో భూకబ్జాలు అడుగడుగునా జరిగాయని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి తోట పవన్ అన్నారు. గురువారం బాలసముద్రంలోని ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి తోట పవన్ మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ అనుచరులు రంజిత్ రెడ్డి రౌడీలను పెంచి పోషిస్తూ అమాయకులపై దాడులు చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేశారన్నారు. ఇప్పుడు ప్రశాంతంగా ఉన్న వరంగల్ పశ్చిమ నియోజవర్గాన్ని మళ్లీ భూకబ్జాలతో కలుషితం చేసే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే నాయిని రాజేందర్ రెడ్డి ఎమ్మెల్యేగా గెలవగానే నియోజకవర్గంలో భూకబ్జాలకు చరమగీతం పాడే విధంగా చర్యలు తీసుకున్నారని తెలిపారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కూడా భూ పంచాయితీలు చేయరాదని గోడపై రాశారని చెప్పారు. ఎంతో మంది ప్రజలకు అన్యాయం చేసిన మాజీ ఎమ్మెల్యే వినయ్ భాస్కర్ అనుచరుడు రంజిత్ రెడ్డి నేడు బయటకు వచ్చి వాళ్లకు న్యాయం చేయాలని అడగడం హాస్యాస్పదంగా ఉందని తోట పవన్ మండిపడ్డారు. దురుద్దేశంతో నాయిని రాజేందర్ రెడ్డిపై తప్పుడు ఆరోపణలు చేయడం సరికాదన్నారు. ఎమ్మెల్యే ఎలాంటి భూవివాదంలో జోక్యం చేసుకోలేదన్నారు. ఎవరైనా వచ్చినా న్యాయస్థానం దృష్టికి తీసుకు వెళ్లమని సూచిస్తారని తెలిపారు. జిల్లాలో వరంగల్ పశ్చిమ నియోజికవర్గం అభివృద్ధి విషయంలో ముందుకు దూసుకుపోతుంటే చూసి ఓర్వలేని వినయ్ భాస్కర్ అనుచరులు విష ప్రచారం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని తోట పవన్ ఆరోపించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు తడక సుమన్, సైండ్ల శ్రీకాంత్, బొంత సారంగం, వల్లెపు రమేష్, యూత్ కాంగ్రెస్ నాయకులు దీపక్ రెడ్డి, కౌటిల్ రెడ్డి, సిరబోయిన సతీష్, సంజయ్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

# కొత్తకొండ జాతర హుండీ లెక్కింపు



**వరంగల్ వాయిస్, కొత్తకొండ :** శ్రీ వీరభద్ర స్వామి దేవస్థానం కొత్త కొండ దేవాలయ ఆవరణలో గురువారం జరిగిన హుండి లెక్కింపు కార్యక్రమంలో నోట్లు రూ.7,03,011, కాయిన్స్ రూ.63,418, మొత్తం రూ. 7,66,429/- వచ్చినట్లు ఆలయ ఈఓ పి.కిషన్ రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ ఇన్ స్పెక్టర్ అనిల్, పీడీ శెట్టి కనకయ్య, పూదరి రవీందర్ గౌడ్, కే.సదానందం, యాటపోలు శ్రీనివాస్, మాడిశెట్టి కుమారస్వామి, శ్రీ సరస్వతీ సేవా సమితి కొత్తకొండ సభ్యులు, శ్రీ రాజ రాజేశ్వర సేవా సమితి హనుమకొండ సభ్యులు ఆలయ ఉప ప్రధాన అర్చకులు రాజయ్య, ముఖ్య రాంబాబు, అర్చకులు శ్రీకాంత్, రమేష్, సందీప్, శివకుమార్, శరత్ చంద్ర, శ్రావణ్, సిబ్బంది రవీందర్, నారాయణరావు, శ్రీధర్, అనూష, రాజు, రాజేందర్, భిక్షపతి, భక్తులు పాల్గొన్నారు.

## కలలు కనండి.. సాకారం చేసుకోండి

### కరస్పాండెంట్ జంపాల మనోహర్



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** నిట్ హనుమకొండలోని సెయింట్ థామస్ ఉన్నత పాఠశాలలో ప్రొఫెషనల్ డే వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ జంపాల మనోహర్ విద్యార్థులు, తల్లిదండ్రులను ఉద్దేశించి ప్రసంగించారు. హనుమకొండ జిల్లాలో తొలిసారిగా, పిల్లలకు భవిష్యత్తులో ప్రొఫెషనల్ స్కిల్ డెవలప్మెంట్ గురించి ప్రాక్టికల్ అవగాహన కల్పించడం ద్వారా, వారు డాక్టర్, ఇంజినీర్, పైలెట్, ఆస్ట్రోనాట్ వంటి రంగాల్లో పోటీ పడేందుకు ప్రేరణ పొందాలని సూచించారు. డా.ఏపీజే అబ్దుల్ కలాం చెప్పినట్లుగా, గొప్ప కలలు కనడం ద్వారా రానున్న కాలంలో వారు ప్రతిష్టాత్మకమైన వ్యక్తులుగా ఎదగగలరని అభినందించారు.

**విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలి..**



నిట్ హనుమకొండలోని సెయింట్ థామస్ ఉన్నత పాఠశాలలో గురువారం A miraculous science fair ను నిర్వహించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ జంపాల మనోహర్, సినిమా డైరెక్టర్ వి అశోక్ , ద్రోణాచార్య అవార్డు గ్రహీత తాబేటి రాజేందర్, జిల్లా ఫిజికల్ డైరెక్టర్ విద్యార్థఉలు ప్రదర్శించిన ప్రాజెక్టులను వీక్షించారు. అనంతరం వారు విద్యార్థులను అభినందిస్తూ వారు భావిభారత శాస్త్రవేత్తలు, గణిత మేధావులు కావాలని ఆకాంక్షించారు.

## ఆహ్వాన పత్రిక అందజేత



**వరంగల్ వాయిస్, నల్లబెల్లి :** మండలంలోని భూలోని పల్లి గ్రామంలో నిర్వహించే శ్రీ పోచమ్మ తల్లి ప్రభ బండి జాతర ఆహ్వాన పత్రికను గౌడ జేఏసీ ములుగు జిల్లా అధ్యక్షుడు ముంజల భిక్షపతి గౌడ్ కు తెలంగాణ గౌడ సంఘం ములుగు జిల్లా అధ్యక్షుడు తోటకూరి శ్రీకాంత్ గౌడ్ అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీకాంత్ గౌడ్ వెంట మల్లంపల్లి మండల సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు గోల్కొండ రాజు, అనిల్, నాగరాజు, అల్లం ఓదెలు, ఎల్పి రామ్, గుండె మీది వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తు చేసుకోవాలి



**వరంగల్ వాయిస్, ఆత్మకూరు :** యువ సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తనుగుల సందీప్ అన్నారు. గురువారం ఆత్మకూరు మండల కేంద్రంలో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం యువత సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు, గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో నిరుద్యోగులపై వివక్ష చూపించారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో యువత అభివృద్ధి చెందాలని రాజీవ్ వికాసం పథకం ప్రవేశపెట్టారని, ప్రతి నిరుద్యోగికి న్యాయం జరుగుతుందన్నారు. నిరుద్యోగ యువతీ యువకులు రాజీవ్ వికాసం పథకానికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. తక్కువ సమయంలో అత్యధిక ఉద్యోగాలు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమం లో వడ్డెపల్లి వేణు, కాడబోయిన రాజ్ కుమార్, రమేష్, శ్రీశైలం, సంతోష్ఉన్నారు.

## బీసీ రిజర్వేషన్ల అమలుకు రాహుల్ గాంధీ జోక్యం అవసరం

**➲ వకుళాభరణం కృష్ణమోహన్ రావు బహిరంగ లేఖ**



**వరంగల్ వాయిస్, న్యూఢిల్లీ:** తెలంగాణలో 42శాతం బీసీ రిజర్వేషన్లను తక్షణమే అమలు చేయాలని కోరుతూ, కాంగ్రెస్ సీనియర్ నేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీకి మాజీ బీసీ కమిషన్ చైర్మన్ డా. వకుళాభరణం కృష్ణమోహన్ రావు ఓ బహిరంగ లేఖ రాశారు. ఈ లేఖను ఏఐసీసీ కార్యాలయం, రాహుల్ గాంధీ కార్యాలయాలకు పంపించారని, తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు. ఇంద్రా సహానీ కేసులో సుప్రీంకోర్టు 50శాతం రిజర్వేషన్ల పరిమితిని సూచించినప్పటికీ, ప్రత్యేక పరిస్థితుల్లో ఈ పరిమితిని మించవచ్చని తేల్చి చెప్పింది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన కుల గణనలో బీసీల జనాభా 56.33% గా నిర్ధారణ అయింది. ఈ గణాంకాలను, గత న్యాయ నిర్ణయాలను, అలాగే గవర్నర్ ఆమోదించిన బీసీ బిల్లులను రాష్ట్ర చట్టంగా అమలు చేయడం ద్వారా 42 శాతం బీసీ రిజర్వేషన్లను అమలు చేయడానికి పూర్తి అధికారాలు రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్నాయన్నారు. తెలంగాణ అసెంబ్లీ ఇప్పటికే 42% బీసీ రిజర్వేషన్ల బిల్లులను ఆమోదించినప్పటికీ, అమలు చేయడంలో జాప్యం జరుగుతోందని డా. వకుళాభరణం గుర్తుచేశారు. రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డికి తక్షణ మార్గదర్శకాలు ఇవ్వాల్సిన అవసరం ఉందని సూచించారు. తెలంగాణ 42% బీసీ రిజర్వేషన్లను పూర్తిస్థాయిలో అమలు చేసి దేశానికి ఆదర్శంగా నిలవాలని, తదుపరి పార్లమెంటులో బిల్లును ఆమోదింపజేసి రాజ్యాంగం 9వ షెడ్యూల్‌లో చేర్చేలా కృషి చేయాలని డా. వకుళాభరణం సూచించారు. ప్రధానమంత్రి కూడా ఈ విషయంలో ప్రత్యేకంగా చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. రాహుల్ గాంధీ 42% బీసీ రిజర్వేషన్ల అమలుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి మార్గనిర్దేశనం చేయాలని, కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని డా. వకుళాభరణం విజ్ఞప్తి చేశారు. కేవలం కేంద్రంపై నెపం వేసి తప్పించుకోకుండా, స్పష్టమైన రాజకీయ నిర్ణయాలతో బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలని సూచించారు. ఈ చర్యలు కాంగ్రెస్ పార్టీపై బలహీన వర్గాల నమ్మకాన్ని పెంచుతాయని ఆయన అభిప్రాయపడ్డారు.

## విమల్ పాన్ మసాలా పట్టివేత



**వరంగల్ వాయిస్, క్రైం:** మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలో జిఎస్‌టి, వే బిల్ లేకుండా అక్రమంగా రవాణా చేస్తున్న విమల్ పాన్ మసాలా పట్టుబడింది. విశ్వసనీయ సమాచారంతో గురువారం టాస్క్ ఫోర్స్ బృందం దాడి నిర్వహించింది. ఈ దాడిలో ఎండి జమీల్ అహ్మద్, గోపాల మధు, భీమ్ రెడ్డిలను అరెస్టు చేసి, వారి నుంచి జిఎస్‌టి లేకుండా రవాణా అవుతున్న విమల్ పాన్ మసాలా, ట్రాలీ ఆటో (AP36TA1528)–25 బ్యాగులు, కంటైనర్ (KA01AM2448)–25 బోరాలు స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న మసాలా విలువ సుమారు రూ. 12,80,000గా అంచనా వేశారు.దాడి అనంతరం నిందితులను, స్వాధీనం చేసుకున్న మసాలాను తదుపరి చర్యల కోసం మిల్స్ కాలనీ పోలీసులకు అప్పగించారు. ఈ ఆపరేషన్‌లో టాస్క్ ఫోర్స్ ఇన్స్పెక్టర్ శ్రీధర్, టాస్క్ ఫోర్స్ సిబ్బంది, మిల్స్ కాలనీ పోలీసులు పాల్గొన్నారు.

## మద్యం సేవించి వాహనం నడపొద్దు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** న్యూ శాయంపేట శ్రీ రాజరాజేశ్వరి ఆటో యూనియన్ అధ్యక్షుడు వేల్పుల సాంబమూర్తి ఆధ్వర్యంలో గురువారం కాజీపేట ట్రాఫిక్ ఎస్సై రామారావు అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ప్రతి ఆటో డ్రైవరు యూనిఫాం, లైసెన్సులో కలిగి ఉండవలెనని కోరారు. అలాగే ప్రతి డ్రైవర్ మద్యం సేవించి వాహనం నడపకూడదన్నారు. లేకుంటే చట్ట పరమైన చర్యలు తప్పవని సూచించారు. సీనియర్ డ్రైవర్లు, డ్రైవర్లు పాల్గొన్నారు.

## సాయిని నరేందర్ కు న్యాయం చేయాలి

### ఆయన భూమిని కబ్జా చేయడం సిగ్గుచేటు

### డీబీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాదాసి సురేష్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఓబీసీ జాక్ చైర్మన్, సామాజిక కార్యకర్త, న్యాయవాది సాయిని నరేందర్ కు చెందిన భూమిని కబ్జా చేసిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకొని ఆయనకు న్యాయం చేయాలని దళిత బహుజన ఫ్రంట్ (డీబీఎఫ్) జిల్లా అధ్యక్షుడు మాదాసి సురేష్ డిమాండ్ చేశారు. గురువారం హనుమకొండ అంబేద్కర్ జంక్షన్ ఏరియాలో వారు మాట్లాడుతూ సాయిని నరేందర్ ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా అనేక సామాజిక, బీసీ మానవీయ ఉద్యమాలకు నాయకత్వం వహించిన నాయకుడని ఆయన భూమిని కబ్జా చేయడం సిగ్గుచేటని విమర్శించారు. ఆయన భూమికి రక్షణగా నిర్మించిన ప్రహరీ గోడను అక్రమార్కులకు మద్దతుగా మునిసిపల్ అధికారులు కూల్చడం సమంజసం కాదన్నారు. ప్రభుత్వం రహదారిని నిర్మించడం మానుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది కలకోటి మహేందర్ వివిధ ప్రజా సంఘాల నాయకులు మోరే ఐలయ్య, పోలేపాక మధుకర్, జన్ను కొమురయ్య, పోలేపాక రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి కూలీలకు తగిన వసతులు కల్పించాలి



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** మండలం పరిధిలోని చీకటాయపాలెం గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ తొర్రూరు డివిజన్ కార్యదర్శి ఉడుగుల లింగన్న పరిశీలించారు. ఈ సందర్భంగా ఊడుగుల లింగన్న మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో ఉన్న నిరుపేద కుటుంబాలకు ఉపాధి హామీ పని కల్పించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి హామీ నిధులను తగ్గిస్తూ పథకాన్ని రద్దు చేసే కుట్ర చేస్తుందన్నారు. కూలీలకు కనీస వేతనం కింద రూ.600 పని ప్రదేశంలో తాగునీరు మెడికల్ కిట్ నీడ వసతి ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతి గ్రూపుకు ఒక మేట్ ని ఏర్పాటు చేయాలన్నారు. జాబ్ కార్డు లేని ప్రతి ఒక్కరికి తక్షణమే కార్డులు మంజూరు చేయాలని కనీస ఉపాధి హామీ రోజులను వంద నుంచి 200 రోజులకి పెంచాలని డిమాండ్ చేశారు. వేసవిలో ఎండలను దృష్టిలో పెట్టుకొని కొలతలతో సంబంధం లేకుండా కనీసం 600 రూపాయలు చెల్లించాలని ప్రమాదవశాత్తు కూలీలకు ప్రమాదం సంభవిస్తే వారికి ఇన్సూరెన్స్ సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు. పని ప్రదేశంలో మరణిస్తే మరణించిన వ్యక్తి కుటుంబానికి ప్రభుత్వం 50 లక్షల ఎక్స్ గ్రేషియా ఇవ్వాలని, వారం వారం క్రమం తప్పకుండా మాస్టర్ స్లిప్ లు అందించాలని రెండు వారాలకు ఒకసారి డబ్బులు పడేవిధంగా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో వాసు, తండా అశోక్, అబ్బాస్, తండా లింగయ్య, అంజయ్య, సప్న, మమత, పద్మ, రమ, కోమలత మనోహర, తదితరులు పాల్గొన్నారు.

# గేరు మార్చేసిన ధన్య..



ధన్య బాలకృష్ణ.. తెలుగు ప్రేక్షకులకు సుపరిచితమే.. టాలీవుడ్, కోలీవుడ్ ఇండస్ట్రీల్లో ఎన్నో చిత్రాల్లో సహాయ నటిగా కనిపించింది. చాలా కాలంగా తెలుగులో కనిపించలేదు. ఇప్పుడు మరోసారి తెలుగులో సినిమా చేసి మెప్పించనుంది. ధన్య బాలకృష్ణ నటించిన బాపు సినిమా ఇటీవలే ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ధన్య బాలకృష్ణ ఎక్కువగా సైడ్ రోల్స్ చేసింది. పేరుకు సైడ్ క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా నటించినా తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపును సంపాదించుకుంది నటి ధన్య బాలకృష్ణ. సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు, సాఫ్ట్‌వేర్ సుధీర్ వంటి చిత్రాలతో తెలుగు ప్రేక్షకులను ఆకట్టుకుందీ ముందుగుమ్మ. నటన, అందంతో ఆకట్టుకుంటూ మంచి గుర్తింపు సంపాదించుకుంటుంది. వరుస అవకాశాలను సొంతం చేసుకుంటూ దూసుకెళుతోంది. తెలుగులో సాఫ్ట్ వేరు సుధీర్, నేను శైలజ, రాజు గారి గది, కార్బన్ వంటి చిత్రాల్లో నటించి గుర్తింపు తెచ్చుకుంది. అటు వెండితెరపైనే కాకుండా డిజిటల్ ప్లాట్ ఫాంలోనూ పలు వెబ్ సిరీస్ చేస్తూ రాణిస్తోంది. అలాగే సోషల్ మీడియాలోనూ యాక్టివ్ గా ఉంటుంది ఈ చిన్నది తాజాగా దాన్యబాలకృష్ణ ఫోటోలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. ధన్య బాలకృష్ణ ఫోటోల పై నెటిజన్స్ రకరకాల కామెంట్స్ చేస్తున్నారు. హీరోయిన్స్ ను మించిన అందం మీది అంటూ కుర్రాళ్ళు కామెంట్స్ చేస్తున్నారు.

## బండ బావమరిది శుభాకాంక్షలు



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ తేజ్ నేడు తన 40వ పుట్టినరోజుని జరుపుకుంటున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఆయనకు సినీ ప్రముఖలంతా సోషల్ మీడియా వేదికగా జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్నారు. ఇప్పటికే మెగాస్టార్ చిరంజీవి చరణ్‌కి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపగా.. తాజాగా సాయిధరమ్ తేజ్ చరణ్‌కి స్పెషల్ బర్త్‌డే విషెస్ తెలిపాడు. 'నీ బండ బావమరిది, బండ ప్రేమ తప్ప ఏమి ఇవ్వగలుగుతాడు.. తీసుకో బావ నా ఈ బండ ప్రేమను' అంటూ ఎక్స్ వేదికగా తన బావ చరణ్‌కి బర్త్‌డే శుభాకాంక్షలు తెలిపాడు. కాగా ఇందుకు సంబంధించిన పోస్ట్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

## నితిన్‌కు క్షమాపణలు చెప్పిన ఆది పినిశెట్టి



టాలీవుడ్ యూత్ స్టార్ నితిన్ నటించిన తాజా చిత్రం రాబిన్ హుడ్. ఛలో, భీష్మ చిత్రాలను తెరకెక్కించిన వెంకీ కుడుముల ఈ సినిమాకు దర్శకత్వం వహించారు. ఎక్స్‌ట్రార్డినరి మ్యాన్ తర్వాత నితిన్ తో మరోసారి జత కట్టింది శ్రీలీల. అలాగే ఆస్ట్రేలియా మాజీ క్రికెటర్ డేవిడ్ వార్నర్ ఈ సినిమాలో క్యామియో రోల్ పోషించనున్నాడు. ఇక కేతిక శర్మ స్పెషల్ సాంగ్ లో సందడి చేసింది. ఇప్పటికే అన్ని హంగులు పూర్తి చేసుకున్న రాబిన్ హుడ్ సినిమా మార్చి 28న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో నితిన్ సినిమాకు ఆల్ ది బెస్ట్ చెప్పాడు మరో నటుడు ఆది పిని శెట్టి. అదే సమయంలో ఒక విషయంలో తనను క్షమించాలని నితిన్ ను కోరాడు. ఈ మేరకు ఆది పినిశెట్టి చేసిన ట్వీట్ ఇప్పుడు వైరలవుతోంది. గత నెలలో ఆది పినిశెట్టి హీరోగా నటించిన శబ్దం సినిమా ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఇంటెన్స్ హారర్ థ్రిల్లర్ గా తెరకెక్కిన ఈ సినిమాలో లక్ష్మీ మేనన్ హీరోయిన్ గా నటించింది. ఆకట్టుకునే కథా, కథనాలు, విజువల్స్, బీజీఎమ్ ఇలా శబ్దం సినిమాలో చాలా పాజిటివ్ అంశాలు ఉండడంతో ఆడియెన్స్ ను బాగానే మెప్పించింది. అయితే శబ్దం సినిమా రిలీజ్ టైమ్ లో నితిన్ ఒక ట్వీట్ చేశాడు. ఆది పినిశెట్టితో పాటు శబ్దం మూవీ యూనిట్ కు ఆల్ ది బెస్ట్ చెబుతూ సోషల్ మీడియాలో ఒక పోస్ట్ పెట్టాడు.



అయితే తన సినిమా ప్రమోషన్ల లో బిజీగా ఉన్న ఆది పినిశెట్టి నితిన్ ట్వీట్ కు రిప్లై ఇవ్వలేకపోయాడట. ఈ క్రమంలోనే నితిన్ సినిమా రాబిన్ హుడ్ సినిమా రిలీజ్ నేపథ్యంలో ఆది పినిశెట్టి ట్వీట్ పెట్టాడు. నితిన్ కు సారీ చెబుతూ రిప్లై ఇచ్చాడు. 'ఇంత లేట్ అయినందుకు సారీ. అప్పుడు శబ్దం సినిమా రిలీజ్ టైమ్ లో ఇష్యూ ఉండడం వల్ల సరిగ్గా స్పందించలేకపోయాను. ఇంత లేటుగా రిప్లై ఇస్తున్నందుకు సారీ' అని ట్వీట్ చేశాడు. అలాగే నితన్ రాబిన్ హుడ్ సినిమా యూనిట్ కు ఆల్ ది బెస్ట్ కూడా చెప్పాడు ఆది పినిశెట్టి. ప్రస్తుతం ఈ ట్వీట్ కూడా నెట్టింట వైరలవుతోంది.

## వరుస హిట్స్ తో రష్మిక దూకుడు

- ఒక్కో సినిమాకు రూ.10 కోట్లు
- ఆమె కారు ఖరీదే రూ. 2 కోట్లు


నేషనల్ క్రష్ రష్మిక మందన్నా.. ప్రస్తుతం వరల్డ్ వైడ్ మారుమోగుతున్న పేరు. యానిమల్, పుష్ప 2 సినిమాతో బ్లాక్ బస్టర్స్ అందుకున్న ఈ బ్యూటీ.. ఇటీవలే ఛావా సినిమాతో మరో విజయాన్ని ఖాతాలో వేసుకుంది. దీంతో గత రెండేళ్లలో మూడు పాన్ ఇండియా చిత్రాలకు ఏకంగా రూ.3 వేల కోట్లకు పైగా వసూళ్లు రాబట్టి సరికొత్త రికార్డ్ క్రియేట్ చేసింది. అంతేకాదు.. ప్రస్తుతం తెలుగుతోపాటు హిందీలోనూ వరుస సినిమాల్లో నటిస్తూ బిజీగా ఉంది ఈ అమ్మడు. ఇటీవలే సికందర్ సినిమాతో అడియన్స్ ముందుకు వచ్చింది. ఏఆర్ మురుగదాస్ దర్శకత్వంలో సల్మాన్ ఖాన్ నటించిన ఈ మూవీకి మంచి రెస్పాన్స్ వస్తుంది. ఇదిలా ఉంటే.. ఇటీవల పోర్బ్స్ నివేదిక రష్మిక సంపాదనను బయటపెట్టింది. ఫోర్బ్స్ నివేదిక ప్రకారం.. రష్మిక ఆస్తులు రూ.66 కోట్లకు పైగా ఉన్నట్లు సమాచారం. అలాగే ఒక్కో సినిమాకు దాదాపు రూ.10 కోట్ల వరకు వసూలు చేస్తుందట. ఇదిలా ఉంటే.. సాధారణంగా సినీరంగంలో హీరోహీరోయిన్స్ ఖరీదైన స్వాంకీ కార్లలో దిగడం కొందరు బాలీవుడ్ స్టార్లకు సాధ్యం అని భావిస్తాం.. తాజాగా నేషనల్ క్రష్ సైతం ఖరీదైన కారుకు ఓనర్ అయ్యింది. ఇటీవలే ఆమె మెర్సిడెస్ బెంజ్ ఎస్ 450ని కొనుగోలు చేసింది. ఈ కారు ధర దాదాపు రూ.2 కోట్లకు పైగా ఉంటుందని టాక్. నిజానికి సినీతారలకు ఆటోమొబైల్స్ పట్ల ఆసక్తి ఎక్కువగా ఉంటుంది. చాలా మంది తారలు రోల్స్ రాయిస్, లంబోర్గినీ, మే బ్యాక్ వంటి ఖరీదైన కార్లలో సందడి చేస్తుంటారు. ఇక ఇప్పుడు రష్మిక సైతం లగ్జరీ కారులో షికారు చేస్తూ ఎక్కడా తగ్గడం లేదు. ప్రస్తుతం రష్మిక గ్యారేజీలో 5 రకాల లగ్జరీ బ్రాండ్ కార్లు ఉన్నాయి. ఈ కార్ల కోసం కోట్లాది రూపాయలను వెచ్చిస్తోంది.



## విక్రమ్ సినిమాకు ప్రమోషన్ నిల్

### ఆశాజనకంగా లేని కలెక్షన్లు

చియాన్ విక్రమ్ తమిళ హీరో అయిన తెలుగులోను ఆయనకి విపరీతమైన ఫాలోయింగ్ ఉంది. విక్రమ్ సినిమాలని ప్రేక్షకులు ఎంతో ఆదరిస్తుంటారు. అయితే అపరిచితుడు తరువాత మళ్లీ విక్రమ్ ఆ రేంజ్ సక్సెస్ చూడలేకపోతోన్నాడు. ఇటీవల విక్రమ్ చేసిన ప్రయోగాలన్నీ కూడా విఫలం అయ్యాయి. తంగలాన్ అంటూ విచిత్ర ప్రయోగం చేసి చాలా కష్టపడ్డాడు. కాని ఆ సినిమాకి రావల్సినంత గుర్తింపు రాలేదు, మూవీ కూడా సక్సెస్ కాలేదు. అయితే తాజాగా విక్రమ్ హీరోగా అరుణ్ కుమార్ వీర ధీర శూరన్ అనే చిత్రాన్ని తెరకెక్కించారు. తెలుగులో వీర ధీర శూర అనే టైటిల్‌తో వచ్చింది. అయితే ఈ రోజు ఉదయం థియేటర్లలో విడుదల కావలసిన ఈ సినిమాకు ఢల్లీ హైకోర్టు షాక్ ఇచ్చింది. విడుదలపై మధ్యంతర నిషేధం విధించడంతో ఉదయం 9 గంటలకు




పడాల్సిన షోలు అన్నీ క్యాన్సిల్ అయ్యాయి. 'వీర ధీర శూర పార్ట్ 2' చిత్రాన్ని హెచ్.ఆర్ పిక్చర్స్ పతాకం మీద రియా శిబు ప్రొడ్యూస్ చేయగా, ఈ మూవీ రిలీజ్ మీద స్టే కోరుతూ ముంబైకు చెందిన ప్రొడక్షన్ కంపెనీ బీ4యు ఢల్లీహైకోర్టును ఆశ్రయించింది. చిత్ర నిర్మాణ సంస్థ తమకు శాటిలైట్ హక్కులను విక్రయించిందని, అయితే ఒప్పందం ప్రకారం విడుదలకు ముందు సినిమా డిజిటల్ స్ట్రీమింగ్ (ఓటిటి) హక్కులను విక్రయించకూడదు. కాని దానిని ఉల్లంఘిస్తూ నిర్మాత డిజిటల్ స్ట్రీమింగ్ రైట్స్ అమ్మేశారని తమ పిటిషన్ లో పేర్కొంది. దీంతో మూవీ రిలీజ్ మీద మధ్యంతర నిషేదం విధించింది. పివిఆర్, ఐనాక్స్ వంటి మల్టీప్లెక్స్ స్క్రీన్లలో ఉదయం 9 గంటలకు షెడ్యూల్ చేసిన షోలు అన్నిటినీ క్యాన్సిల్ చేశారు. ఓవర్సీస్‌లో షోలు కూడా పడాల్సి ఉంది. కానీ అక్కడ షోలు క్యాన్సిల్ అయ్యాయ్ అని సమాచారం. గురువారం వీరధీరశూర పార్ట్ 2 రిలీజ్ కాగా, బుకింగ్స్ ఏ మాత్రం ఆశాజనకంగా లేవు. ప్రమోషన్లు కూడా అంతగా జరగలేదు. ఒక రోజు విక్రమ్ టీమ్ వచ్చి మీడియాని కలిసి, ప్రెస్ మీట్ పెట్టి ఇంటర్వ్యూలు ఇచ్చి వెళ్లిపోయారు. తమిళంలో కూడా బుకింగ్స్ అంతగా ఏమి లేవు. వీర ధీర శూర సినిమా వస్తున్నట్టుగా మాకు తెలీదే అంటూ కొంత మంది సెటైర్లు కూడా వేస్తున్నారు. ఢల్లీహైకోర్టు షాక్ ఇవ్వడానికి ముందు కూడా ఎర్లీ మార్నింగ్ షోస్ టికెట్స్ కొన్నవారే కరువయ్యారు. అసలు విక్రమ్ మూవీకి ఎందుకు ఇలాంటి పరిస్థితి వచ్చింది అని అందరు ముచ్చటించుకుంటున్నారు.

WARANGALVOICE
www.epaper.warangalvoice.net
www.warangalvoice.net
వరంగల్ వాయిస్ Evening Daily
GRATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet
గురువారం, మార్చి 27, 2025



# సాంకేతిక పద్ధతుల్లో వ్యవసాయం

- అధిక రాబడికి ఉపకారి
- కలెక్టర్ డాక్టర్ సత్య శారద

**వరంగల్ వాయిస్, వరంగల్ :** శాస్త్ర, సాంకేతిక పద్ధతులను రైతులు వినియోగించి అధిక రాబడి పొంది ఆర్థికంగా పురోభివృద్ధి సాధించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. వరంగల్ లోని రంగశాయిపేట ఎస్ కే ఫంక్షన్ హాల్ లో మూడు రోజులపాటు నిర్వహించిన రాష్ట్రస్థాయి రైతు ఉత్పత్తిదారుల సంఘాల ముగింపు సమావేశానికి గురువారం జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులు ఆధునికమైన విత్తనాలు, తగినంత విద్యుత్ సరఫరా, సులభతరమైన మార్కెట్ అందుబాటులో పొందేట్లు చూసే దిశగా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఇలాంటి రైతు ఉత్పాదక





మేళాలు వ్యవసాయ మార్కెటింగ్ సంస్కరణలో నూతన అధ్యాయాన్ని జోడిస్తాయన్నారు. మండలాల్లో కూడా ఇలాంటి కార్యక్రమాలు చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. ఈ మేళా ద్వారా నిష్ణాతులైన శాస్త్రవేత్తలు అందించిన నూతన సాంకేతిక పరిజ్ఞానం, సేంద్రియ పద్ధతులను అమలు చేసి ఎఫ్ పీఓలు అభివృద్ధి సాధించాలన్నారు. పర్యావరణాన్ని పరిరక్షించడంతో పాటు సింగిల్ యూస్ ప్లాస్టిక్ ను నియంత్రించేలా ఒక ఎఫ్ సీఓ తయారుచేసిన టీ కప్పుల మాదిరిగా వినూత్నంగా ఆలోచించి ఆవిష్కరణ చేయాలని అన్నారు. రైతు ఉత్పాదక సంస్థల ద్వారా రైతులు ఉత్పత్తులను సమష్టిగా మార్కెటింగ్ ప్రాసెసింగ్ ప్యాకేజింగ్ చేసుకోవాలన్నారు. రైతు ఉత్పత్తిదారుల సంస్థలపై పూర్తి అవగాహన కలిగి ఉండి వాటి ప్రయోజనాలు పొందాలని కలెక్టర్ తెలిపారు.

ఈ సందర్భంగా వివిధ ఎఫ్ పీఓలు 40 స్టాళ్ళు ఏర్పాటు చేయగా, అందులో ఉత్తమ ప్రతిభ కనపరిచిన స్టాల్ నిర్వాహకులకు కలెక్టర్ చేతుల మీదుగా ప్రథమ, ద్వితీయ, తృతీయ నగదు బహుమతులు అందించారు. మిగిలిన 37 స్టాళ్ల ఎఫ్ పీఓ ప్రతినిధులకు సర్టిఫికెట్లు, మెమొంటోలు ప్రదానం చేశారు. సుమారు 2,500 మంది రైతులు ఈ మేళను సందర్శించారన్నారు. సుమారు లక్షన్నర రూపాయల ఎఎఫ్ పీఓల ఉత్పత్తుల అమ్మకాలు జరిగాయన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ అధికారి, డిప్యూటీ ప్రాజెక్టు మేనేజర్ రమన్ సింగ్, జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ, అసిస్టెంట్ రిజిస్ట్రార్ జగన్మోహన్ రావు, నాబార్డు ఏజీఎం రవి, వరంగల్ లీడ్ బ్యాంకు మేనేజర్ రాజు, మామునూరు కృషి విజ్ఞాన కేంద్ర కోఆర్డినేటర్ రాజన్న, జిల్లాకు చెందిన వ్యవసాయ, అనుబంధ శాఖల మండల, క్లస్టర్, గ్రామస్థాయి అధికారులు, 600 మందికి పైచిలుకు రైతులు తదితరులు పాల్గొన్నారు.



# కబరస్థాన్ లో గ్యాంగ్ వర్క్

**వరంగల్ వాయిస్, కాజీపేట :** రంజాన్ పర్వదినం సందర్భంగా కాజీపేట 63వ డివిజన్ లోని కబరస్థాన్ లో గురువారం మున్సిపల్ సిబ్బంది గ్యాంగ్ వర్క్ నిర్వహించారు. పండుగకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నామని స్థానిక కార్పొరేటర్ విజయ్ శ్రీ సయ్యద్ రజాలి తెలిపారు. ఈద్గా పనులు కూడా శరవేగంగా జరుగుతున్నాయన్నారు. ఈద్గాను సుందరంగా ముస్తాబ్ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సానిటరీ ఇన్ స్పెక్టర్ వెంకన్న, జవాన్ సురేందర్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఏప్రిల్ 20న సర్వసభ్య సమావేశం

- హనుమకొండ రెవెన్యూ కాలనీలో ఏర్పాటు
- ఎస్సార్ కో-ఆపరేటివ్ హౌజింగ్ సొసైటీ కమిటీ నిర్ణయం

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఎస్సార్ మ్యూచువల్లి ఎయిడెడ్ కో–ఆపరేటివ్ హౌజింగ్ సొసైటీ లిమిటెడ్ సర్వసభ్య సమావేశాన్ని ఏప్రిల్ 20న నిర్వహించనున్నట్లు సొసైటీ అధ్యక్షుడు పోలాడి రంగారావు, ప్రధాన కార్యదర్శి వేముల అనంత రెడ్డి, ఉపాధ్యక్షుడు డి.సంజీవయ్య ఒక ప్రకటనలో తెలిపారు. సభ్యుల సంక్షేమం కోసం TMC/WGL/DCO/2019/141, తేది 26-09-2019న సొసైటీని ఏర్పాటు చేసినప్పటికీ అప్పటి పాలక వర్గం అనేక అవినీతి అక్రమాలకు పాల్పడడంతో పాటు కనీసం సర్వ సభ్యసమావేశాలు కూడా ఏర్పాటు చేయలేదని ఆరోపించారు. సొసైటీ పేరున ఇప్పటికీ బ్యాంక్ అకౌంట్ తీయకపోవడం, ఫోర్జరీ సంతకాలతో మెంబర్షిప్ చేయడం, భూమి అమ్మిన డబ్బులను బ్యాంకులో జమ చేయకపోవడాన్ని దుయ్యబట్టారు. దీంతో సొసైటీ పాలకవర్గంపై అనుమానాలు వచ్చి పోలీసులను ఆశ్రయించగా వారిపై అక్టోబర్ 6, 2023న కేసు నెంబర్ 567/2023 నమోదు చేశారన్నారు. దీంతో సొసైటీ సభ్యులందరికీ జవాబుదారీగా ఉండాలన్న సంకల్పంతో ముగ్గిరితో ఒక తాత్కాలిక కమిటీని ఏర్పాటు చేశామని వెల్లడించారు. ఈ కమిటీ ఆధ్వర్యంలోనే ఏప్రిల్ 20న ఉదయం 10.30 గంటలకు పోతూరి ప్రతాప్ రెడ్డి, ఇంటి నెంబర్ 1-7-492, రెవెన్యూ కాలనీ, సుబేదారిలో సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. ఈ సమావేశంలో ఎస్సార్ సొసైటీ సభ్యులందరూ పాల్గొని తమ అభిప్రాయాలను కమిటీతో పంచుకోవాలని సూచించారు. అదే విధంగా గత కమిటీ చేసిన అనేక అవినీతి అక్రమాలపై కూడా ఈ సమావేశంలో చర్చించి తగు నిర్ణయం తీసుకోనున్నట్లు ప్రకటించారు.

# సమాజ సేవకు పదవీ విరమణ అడ్డంకి కాదు

- పోపా రాష్ట్ర అధ్యక్షుడు శామంతుల శ్రీనివాస్
- ఉపాధ్యాయుడు గుండు కామేశ్వర్ కు ఘన సన్మానం

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరి అని పోపా రాష్ట్ర అధ్యక్షుడు శామంతుల శ్రీనివాస్ అన్నారు. అయితే సమాజ సేవకు పదవీ విరమణకు అడ్డంకి కాదన్నారు. బుధవారం కాశిబుగ్గలోని పద్మశాలి కమ్యూనిటీ హాల్ లో పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయుడు గుండు కామేశ్వర్ ఆత్మీయ అభినందన సభ పోపా ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అయితే గుండు కామేశ్వర్ వరంగల్ జిల్లాలోని వివిధ మండలాల్లో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తించి మహబూబాబాద్ జిల్లా నుంచి పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయుడు కామేశ్వర్ సేవలను కొనియాడారు. పలువురు ఉపాధ్యాయులు, గుండు కామేశ్వర్–భాగ్యలక్ష్మి దంపతులను గజమాలతో సత్కరించి, పూల బోకే అందజేసి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో వ్యాఖ్యాతగా చందర్ వ్యవహరించారు. పోపా కార్యవర్గం గోషికుండ సుధాకర్, పాము శ్రీనివాస్, మాటేటి అశోక్, ధర్మపురి గోవిందు, పెద్దూరి పెద్దన్న, బైరి



శ్యాంసుందర్, వంగరి వేణుగోపాల్, అనిల్ కుమార్ పద్మశాలి సంఘం అధ్యక్షుడు ఆడెపు రవీందర్, వడ్నాల నరేందర్, గోరంటల రాజు, బత్తుల సత్యం తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టులకు రైల్వే రాయితీ కల్పించాలి

- రాజ్యసభలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** రైల్వేలో జర్నలిస్టుల రాయితీ పథకాన్ని పునరుద్ధరించాలని రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. పెద్దల సభలో గురువారం ఆయన మాట్లాడుతూ జర్నలిస్టుల్లో అధిక సంఖ్యాకులు తక్కువ, మధ్య తరగతి ఆదాయ వర్గాలకు చెందిన వారేనన్నారు. విధి నిర్వహణలో భాగంగా వారు రైళ్లలో ప్రయాణాలు చేస్తుంటారన్నారు. కోవిడ్ కారణంగా ఎత్తేసిన రాయితీ పథకాన్ని పునరుద్ధరించడం ద్వారా జర్నలిస్టులకు మేలు చేసిన వారమవుతామన్నారు. వారిపై ఆర్థిక భారం పడకుండా సాయం చేయాల్సిందిగా రైల్వే మంత్రిత్వ శాఖను కోరారు. రైలు ప్రయాణాల సందర్భంగా గతంలో మాదిరిగా 50శాతం రాయితీని పునరుద్ధరించాల్సిందిగా పాత్రికేయులు, వారి సంఘాలు మూడేళ్లుగా కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తులు చేయడాన్ని ఈ సందర్భంగా ఎంపీ వద్దిరాజు గుర్తు చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో నాలుగో స్థంభంగా సమాజానికి తమ విలువైన సేవలందిస్తున్న జర్నలిస్టులకు రైల్వే టిక్కెట్లలో 50 శాతం రాయితీ కల్పించడం సమంజసం, సముచితమని ఎంపీ రవిచంద్ర చెప్పారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com